క్లుప్తంగా

నేత్ర దానం



నాగాయలంక: గ్రామంలోని మూడో వార్డుకు చెందిన రైతు తుంగల నాంచారయ్య (80) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. కాగా ఆయన నేత్రాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. తన తండ్రి నేత్రాలు దానం ద్వారా మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం కల్పించాలనే సంకల్పంతో ఆయన కుమారులు తుంగల శ్రీనివాసరావు, రామాంజనేయులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందు కొచ్చారు. మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కె.వెంకటనారాయణ సహకారంతో కంటి ఆసుపత్రి ఐటెక్నీషియన్ మహేష్ తదితరులు మృతుని నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 18న పమిడిముక్కల మండలం తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు పి.మధు ప్రియ, డి.నాంచారమ్మ ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం కే.నాగరత్న కుమారి తెలిపారు. వీరు ఈ నెల 25, 26 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులతో పాటు వీరికి తర్ఫీదునిచ్చిన పీఈటీ ఏ.వెంకట తాతాజీని ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

చల్లపల్లి: స్థానిక ఎంపీడీవోగా ఎం.ఎం.ఆనంద కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కంచికచర్లలో ఏవోగా పనిచేసిన ఆమె ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా చల్లపల్లికి వచ్చారు. మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఏఓ అతావుల్లా, పీఆర్ ఏఈ బి.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంటు శ్యామ్‌సన్‌బాబు ఆనందకుమారికి పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

కృత్తివెన్ను ఎంపీడీవోగా..

కృత్తివెన్ను: స్థానిక ఎంపీడీవోగా నూతులపాటి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయ ఏవోగా విధులు నిర్వహించిన ఆయన ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందారు. ఈమేరకు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, సీఈవో ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, మండల పరిషత్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ

మోపిదేవి: ప్రాణాంతకమైన ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లను పూర్తిగా నిషేధించాలని గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు ఎంపీపీ రావి దుర్గావాణి తెలిపారు. మోపిదేవి జెడ్పీ ఉన్న పాఠశాల విద్యార్థులతో ప్లకార్డులు చేతబూని శుక్రవారం బారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనార్థాలను వివరించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల రాబోవు కాలంలో ప్రతి ఇంటిలో ఒకరు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులుగా మారే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని గుర్తుచేశారు. ఎంఈవో-2 వెంకట రమణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తామమని ప్రతిజ్ఞ చేయంచారు. భావితరాల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు పి.జయంతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సురేష్‌కు మ్యాన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు



చల్లపల్లి: చల్లపల్లికి చెందిన ఉపాధ్యాయుడు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబుకు తెలంగాణకు చెందిన ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ మ్యాన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు- 2025తో శుక్రవారం సత్కరించింది. హైదరాబాదులోని హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి ఇచ్చే డాక్టర్ దాసరి నారాయణరావు స్మారక (మ్యాన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) అవార్డును ఈ ఏడాది దేవరపల్లి సురేష్‌బాబుకు మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ రావూరి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఇందిర, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పి.వి.పి. అంజనీకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు సురేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటుపరం ఆలోచనపై ఉప్పొంగిన నిరసన



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతం అయింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) నేతృత్వంలో చలో మెడికల్ కళాశాల కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఉదయం నుంచి బందరు మెడికల్ కళాశాలకు వెళ్లే రహదారుల్లో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వందల సంఖ్యలో పోలీసులు మోహరించారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థులు కూటమి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించారు. నిరసన గళం వినిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







రెండో రోజూ కొనసాగిన వీఆర్ఏల నిరసన



ఘంటసాలలో నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు



కోడూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు



అవనిగడ్డలో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

ఘంటసాల: న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం రెండోరోజుకు చేరాయి. ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా, అటెండర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు రద్దు చేయాలని, డీఏలు పునరుద్ధరించాలని, సర్వీస్ రూల్స్ పాటించాలని కోరారు. మండల వీఆర్ఏల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.మహేష్, కె.వెంకటేశ్వరరావు, వీఆర్ఏలు సీహెచ్.బాలశ్రీను, కె.రవీంద్ర, బి.దేవకి, కె.మౌనిక, ఎల్.సుధాకర్, పి.అమృతం, కె.గోవిందు, కె.బాలశంకరరావు, పి.నాగ సుబ్రహ్మణ్యం, వి.వేణుగోపాలరావు, ఎం.బసవయ్య, వి.చంద్రరావు, జి.చింతయ్య, ఎం.ఏసుదాసు, ఎం.రామకృష్ణారావు పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వీఆర్ఏలకు కనీస వేతనం ఇవ్వకుండా పని భారాన్ని మాత్రం అధికంగా ఇస్తున్నారంటూ నినాదాలు చేశారు. అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. వీఆర్ఏల ధర్నాకు సీఐటీయూ నేతలు మద్దతు తెలిపారు. అనంతరం వీఆర్వోలు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయికి వినతిపత్రం అందించారు.

అవనిగడ్డ: పలు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శించారు. వీఆర్ఏలు మునిపల్లి వెంకటేశ్వరరావు, మునీశ్వరరావు, సంపూర్ణరావు, ముసలయ్య, 15 మంది వీఆర్ఏలు పాల్గొన్నారు.

గూడూరు: వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు పెడసనగంటి వీర వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. జి.గంగాధరరావు, నత్తా నాగేంద్రరావు, మల్లంపల్లి పాండురంగారావు, పెడసనగంటి కేశవ, మెండు ప్రసన్న, బీరం రాధిక, పోలుకొండ కళ్యాని, మొహమ్మద్ షరీఫ్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఉద్యోగుల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం సాయంత్రం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ 21 అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు వాటిని పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 3వ శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు. అనంతరం కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు వచ్చిన అభ్యర్థులకు నియామకపత్రాలను ఆయన అందజేశారు.



ఉద్యోగుల సమస్యలు వింటున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రభుత్వ ఉద్యోగుల పని ఒత్తిడిని నుంచి ఉపశమనానికి యోగాసాధన ఎంతో ఉపకరిస్తుందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో యోగామృత ప్రాసన క్రియపై రూపొందించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు గొడుగుపేట కన్యకాపరమేశ్వరి సత్రంలో యోగామృత ప్రాసన క్రియ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్ది రాజులు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లకు గురవుతూ ఉంటామని, దానికి యోగా ఒక మహా ఔషధమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి



బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు గ్రామ పరిధిలో పంట పొలం వద్ద భూ వివాదంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గుంపెన సాంబశివరావు, మాకాల వెంకట్రావు కుటుంబాల మధ్య భూ వివాదం ఉంది. సాంబశివరావు ఈ నెల 17న పొలం వద్ద పనిలో ఉన్న సమయములో వచ్చిన మాకాల వెంకట్రావు, మాకాల శివరాంప్రసాదు, మాకాల వాసుదేవరావు దాడి చేశారు. సాయంత్రమైనా భర్త ఇంటికి రాకపోవడంతో భార్య సావిత్రి పొలం వెళ్లి భర్త పరిస్థితి చూసి అంబులెన్స్‌లో బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించింది. చికిత్స పొందుతూ సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్‌కుమార్ ఈ నెల 18న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: కోడూరు, రామకృష్ణాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ గోపిచంద్ శుక్రవారం తెలిపారు. కోడూరు సబ్‌స్టేషన్‌లోని వేణుగోపాలపురం, ఉల్లిపాలెం, మంసలదీవి, పాలకాయతిప్ప, జరుగువానిపాలెం, నక్కవారిదారి, జయపురంలో గృహాలు, ఆక్వా చెరువులకు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ కోత ఉంటుంది. రామకృష్ణాపురం పరిధిలో ఊటగుండం, చేబ్రోలువారి దిబ్బ, ఇరాలి, ద్వారక, పాతఉపకాలి, రామకృష్ణాపురం, సంగమేశ్వరం గ్రామాల పరిధిలో కోత విధించనున్నట్లు ఏఈ తెలిపారు.

108 మందికి కంటి వైద్య పరీక్షలు

తాడేపల్లి(ఘంటసాల): మండలంలోని తాడేపల్లి గ్రామంలో రెండో రోజు శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. తాడేపల్లి పెద్దాశ్రమంలో వారం రోజుల పాటు నిర్వహించే ఉచిత కంటి పొర చికిత్స శిబిరంలో ఈ నెల 21 వరకు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి 22 నుంచి కంటి పొర శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల డాక్టర్ ఓవియో ఆధ్వర్యంలో జి.రంజిత్ కుమార్, డి.మోజెస్, ఆల్బర్ట్, జగన్, ఆష్టమ్స్ అశ్విన్, కిషోర్ కుమార్, టోని 108 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 17 మందికి కంటి శుక్లం ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. 19 మందిని చెన్నైలోని శంకర నేత్రాలయానికి సిఫారసు చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. సూరపనేని రామలింగయ్య- వెంకటరావమ్మల జ్ఞాపకార్థం మనవడు ఎన్నారై సూరపనేని శ్రీనివాస్- నాగ ప్రియ దంపతులు ఆర్థిక సహకారంతో నిర్వహించారు.



తాడేపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

రేపు ఉచిత వైద్యశిబిరం

నాగాయలంక: మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు 50వ రోజు పురస్కరించుకుని స్థానిక ఎంవీకే రావు శత జయంతి ఉత్సవ కమిటి, విజయవాడ ఒమెగా అనూ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో 21వ తేదీన నాగాయలంకలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని శ్రీవాసవి కన్యకాపమేశ్వరి కల్యాణ మండపంలో ఉదయం గం.9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గుండె సంబంధిత ఈసీజీ, 2డీఎకో, బీపీ, సుగర్ పరీక్షలు, మహిళల గర్భ సంబంధిత సమస్యలకు పరీక్షలు, మూత్రపిండాలు, జీర్ణకోశ తదితర వ్యాధులకు పరీక్షలు ఉచితంగా చేస్తారని వివరించారు. అవసరమైన మందులను రెడ్‌క్రాస్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, కాంట్రాక్టర్ సబ్బినేని మహేష్ ఆర్థిక సౌజన్యంతో ఉచితంగా అందిస్తామన్నారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ

నాగాయతిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయతిప్ప అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్థానిక పాలకేంద్రం కార్యదర్శి బల్లా లక్ష్మణస్వామి ఆర్థిక సౌజన్యంతో 6 కుర్చీలు, పలకలు, బిస్కెట్ల ప్యాకెట్లు శుక్రవారం అందించారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదగా వీటిని అంగన్‌వాడీ కేంద్రానికి అప్పగించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త పద్మ తెలిపారు. మండలి వెంకట్రామ్, ఎంపీటీసీ సభ్యులు దిడ్ల రాణి పాల్గొన్నారు.

117 మందికి వైద్య సేవలు



పెడన: చేవేంద్ర పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం చెన్నూరు గ్రామంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. జిల్లా మలేరియా అధికారి బి. రామారావు, సబ్ డివిజనల్ అధికారి మురళి, చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది వైద్య సేవలను అందించారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేశారు. జలుబు, దగ్గు వంటి వాటితో ఇబ్బంది పడుతున్న వారికి మందులను అందజేశారు. దీర్ఘకాలికంగా షుగర్ తదతర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డ్రై డే ఫ్రైడే సందర్భంగా మలేరియా అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 117 మందికి వైద్య సేవలను అందించామన్నారు. ఫీవర్ సర్వే ద్వారా ఒకరికి మాత్రమే జ్వరం ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారు. ఎంపీహెచ్ఎస్ జీవీవీ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లను గుర్తించి బోర్డులు పెట్టండి

ముడా ప్లానింగ్ అధికారి ఆశాలత

పెడన: ముడా పరిధిలో 13 మండలాలున్నాయని, ఈ 13 మండలాల్లో కృష్ణా జిల్లాకు సంబంధించి తొమ్మిది, ఏలూరు జిల్లాకు చెందిన నాలుగు మండలాలున్నాయని, కృష్ణాజిల్లాలోని తొమ్మిది మండలాల్లో కూడా లే అవుట్లను గుర్తించి క్రమబద్దీకరించే పనిలో ముడా నిమగ్నమైందని ముడా ప్లానింగ్ అధికారి డి.ఆశాలత అన్నారు. శుక్రవారం ఆమె పెడన ఎంపీడీవో కార్యాలయంలో ఆయా మండలాలకు చెందిన ఎంపీడీవోలతో కలిసి గుడ్లవల్లేరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాలోని పంచాయతీల వారీగా అనధికారిక లే అవుట్లను గుర్తించడం జరిగిందన్నారు. బంటుమిల్లిలో మూడు, కృత్తివెన్నులో ఒకటి, గూడూరులో మూడు, పెడనలో ఐదు, గుడ్లవల్లేరులో నాలుగు ఇలా చాలా ఉన్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని అనధికారిక లే అవుట్లు వద్ద నోటీసు బోర్డులు పెట్టాలని స్పష్టం చేశారు. ఒకటికి రెండు సార్లు సదరు లే అవుట్ యాజమాని దృష్టికి తీసుకువెళ్లినా స్పందించక పోతేనే నోటీసు బోర్డు పెట్టాలని సూచించారు. అనధికారిక లే అవుట్ల స్థలాలు కొనుగోలు చేస్తే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందనే విషయం కూడా ఆ నోటీసు బోర్డులో ఉండేలా చూడాలని సూచించారు. త్వరితగతిన క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పెడన, గుడ్లవల్లేరు, కృత్తివెన్ను ఎంపీడీవోలు ఎ.అరుణకుమారి, ఇమ్రాన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ముడా ప్లానింగ్ అధికారి ఆశాలత

ఆరోగ్యవంతమైన మహిళలతోనే మెరుగైన సమాజం

గూడూరు: ఆరోగ్యవంతమైన మహిళలతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అరుణ కాత్యాయని అన్నారు. స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌ను పురస్కరించుకుని గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ అరుణ కాత్యాయని మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి శిశువు ఆరోగ్యంగా పుట్టాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిలో భాగంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులలో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వైద్యాధికారులు వి.నరేంద్ర, అమ్మద్ ఖాన్, పి.భాస్కర్, జి.ఫణిరాజు, ఆర్.దుర్గారావు, బి.స్వామి తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో మాట్లాడుతున్న వైద్యాధికారులు

ఆరోగ్యానికి వ్యక్తిగత శుభ్రత అవసరం

సీడీపీవో సముద్రవేణి

కృత్తివెన్ను: మంచి ఆహారంతో పాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత కూడా ఆరోగ్యంలో భాగమేనని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గరిశపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మహిళలు కొంత వయస్సు వచ్చిన తరువాత తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భవతులు, బాలింతలు ప్రణాళికాబద్దంగా తాము తీసుకునే ఆహారంలో అన్ని రకాలైన పోషకాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు పాలివ్వడం, కాన్పుకు, కాన్పుకు మధ్య సరైన గ్యాప్ ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్యోగంపై శ్రద్ధ వహించాలి

కోడూరు: మహిళలు తమ వ్యక్తిగత ఆర్యోగంపై శ్రద్ధ వహించాలని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రాణి సంయుక్త అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'స్వస్థ నారి సశక్తి పరివార్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సాలెంపాలెం గ్రామంలో మహిళలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం శిబిరంలో 40 మంది రక్తపోటు, 50 మంది మధుమేహ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు, పీహెచ్ఎన్ పుష్పలత, 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కే.శ్రీనివాస్ పెరుమాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెం 2 చాట్రగడ్డవానిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఎంఈవో ఎస్.శివశంకరరావు, పంచాయతీ కార్యదర్శి బి.అర్జునరావు, సీబీసీఎన్‌సీ హెచ్ఎం కె.సాల్మన్ రాజు, జీఎంఎస్‌కే జి.నజరేయ కుమారి, ఎంపీటీసీ కొల్లూరి విజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్.మానస, కె.కనకదుర్గ, ఎం.ఉమాదేవి, జె.రాజ్యలక్ష్మి, పి.హేమలత, హెల్పర్ సీహెచ్.జయశ్రీ, తల్లులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆజాద్‌రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గం శుక్రవారం తెలిపారు. ఉత్సవాల కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి వెంకటబాబాప్రసాద్ మాట్లాడుతూ 22వ తేదీ ఉదయం 7.46 గంటలకు కలశ స్థాపన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. రోజువారీ కార్యక్రమాలను వివరించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సామా వెంకట లక్ష్మీ కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవరావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొక్కిలిగడ్డ(మోపిదేవి): దశరా మహోత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా భమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

నాగాయలంక: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో 33వ వార్షిక శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు శుక్రవారం తెలిపారు. రోజువారీ నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. నాగాయలంక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం కనక దుర్గమ్మ ఆలయం ముస్తాబైంది. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ వర్గాలు తెలిపాయి. గణపేశ్వరంలోని శ్రీదుర్గా శ్రీగణపేశ్వరస్వామి, పార్వతీ సంగమేశ్వరస్వామి ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి.

నందీశ్వరునికి వైభవంగా అభిషేకాలు



నాగాయలంక: బహుళ త్రయోదశి పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శ్రీనందీశ్వరునికి శుక్రవారం రాత్రి పంచామృతాభిషేకాలు, రామలింగేశ్వరునికి విశేష పూజ, హారతులు జరిపారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో పలువురు సామాన్య భక్తులు అభిషేకాలు జరిపారు. నంది, రామలింగేశ్వరునికి శాస్త్రోక్తంగా పూజ జరిపి భక్తులకు మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఉప్పల బుజ్జి తదిర ప్రముఖులు, గ్రామస్తులు, భక్తులు నందీశ్వరుని అభిషేకించి స్వామివారిని దర్శించుకున్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



నాగాయతిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయతిప్పలో పాలకేంద్రం అధ్యక్షుడు యార్లగడ్డ శేష గిరిరావు అధ్యక్షతన శుక్రవారం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. ఏప్రిల్ 1, 2025 నుంచి జూలై 31, 2025 మధ్య నాలుగు నెలల కాలానికి గాను వచ్చిన బోనస్ రూ.25,903లను 32 మంది సభ్యులకు పామర్రు పాలశీతలీ కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ పంపిణీ చేశారు. పాడి రైతు కుటుంబంలో జరిగిన వివాహానికి తాతా శ్రీనివాసరావు కుమారుడు వినీత్‌కుమార్ దంపతులకు కృష్ణా మిల్క్ యూనియన్ తరపున రూ.20 వేలు విలువగల బంగారు నాణెం బహూకరించారు. పాల కేంద్రం డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, ఏఎంపీవో తమ్మన సురేష్‌కుమార్, సూపర్‌వైజర్ మత్తి అనిల్‌కుమార్, పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు పుప్పాల సతీష్ (నాని), దిడ్ల నారాయణరావు, సంఘం కార్యదర్శి బల్లా లక్ష్మణస్వామి, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.